సాక్షి
వికారాబాద్
మంగళవారం । 10 । జనవరి । 2023



ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు?
ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది లేక పోవడంతో ప్రజలకు సేవలు అందడంలేదు.
8లో▸



జాయ్‌ఫుల్ ఎడ్యుకేషన్..
విద్యార్థులకు జాయ్‌ఫుల్ ఎడ్యుకేషన్ అందించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు.
8లో▸



ప్రారంభానికి ముందే..
రహదారుల నిర్మాణం, విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు పెడుతున్నా.. లక్ష్యం నెరవేరడం లేదు.
9లో▸

న్యూస్‌రీల్

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి: చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ పరిధిలోని పరిధిలోని తుంకులగడ్డ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు దుప్పట్లు, బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల జిల్లా స్థాయి పాటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. పాఠశాలల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, కౌన్సిలర్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



పరిగిలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పరిగి: అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గణపతితో పాటు మరో ఇద్దరిపై తప్పుడు కేసులు నమోదు చేశారని తెలిపారు. దీన్ని నిరసిస్తూ సోమవారం విధులు బహిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో జరిగిన సంఘటనపై న్యాయస్థానం ఉత్తర్వులను పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అడ్వకేట్లు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పన జిల్లా అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ ఒక ప్రటకనలో తెలిపారు. ముత్తూట్ గ్రూప్‌లో పని చేసేందుకు సుమారు వంద మందిని వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. హైదరాబాద్, వికారాబాద్ జిల్లాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9676047444లో సంప్రదించాలని తెలిపారు.

పరీక్షలకు సిద్ధంకండి



దోమలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ హరిశ్చందర్

దోమ: విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించాలని ఎంఈఓ హరిశ్చందర్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చదువుపై శ్రద్ధ చూపిస్తేనే లక్ష్యాలు చేరుకుంటారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్‌ఓ మంగమ్మను ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శబరికి తరలిన అయ్యప్పలు

కొడంగల్: పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాములు సోమవారం శబరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాలధారులకు గురుస్వాములు ఇరుముడి కట్టారు. అనంతరం సద్ది పూర్తి చేసుకొని కొడంగల్ నుంచి అయ్యప్పస్వామి సన్నిధానానికి బయలుదేరారు. గురుస్వాములు ఉమాపతిగౌడ్, తలారి గోపాల్, బుక్క విజయకుమార్, మధు, రాజు తదితరులు ఉన్నారు.

బిల్లు లేపుడే!

క్రీడా ప్రాంగణాల పేరుతో నిధుల స్వాహాకు కుట్ర

- పాత పనులను చూపిస్తూ దోచుకునే ప్రయత్నం
- ఒక్కో పార్కు పేరున రూ.4.04 లక్షలు కాజేసేలా ప్లాన్
- స్థానిక కౌన్సిలర్లకు తెలియకుండా జాగ్రత్తలు
- మండిపడుతున్న మున్సిపల్ ప్రజలు



17వ వార్డు మేఘన టౌన్‌షిప్ పార్కు

వికారాబాద్ అర్బన్: ప్రభుత్వ పథకం ఏదైనా వికారాబాద్ మున్సిపల్ అధికారులకు కాసులు కురిపిస్తోంది. చేయని పనులకు బిల్లులు కాజేసేందుకు రంగం సిద్ధం చేసుకోవడం కౌన్సిలర్లను సైతం విస్మయానికి గురిచేస్తోంది. నిన్నమొన్నటి వరకు హరితహారం పేరుతో మొక్కల గారడీ చేసిన వీరి కన్ను ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలపై పడింది. మున్సిపాలిటీకి నాలుగు క్రీడా ప్రాంగణాలు మంజూరయ్యాయి. మూడింటిలో నామమాత్రపు పనులు చేయించిన వీరు.. కాంట్రాక్టర్ల పేర్లను పేర్కొంటూ ఒక్కో క్రీడా ప్రాంగణంపై రూ.4.04 లక్షల బిల్లు తీసుకునేందుకు రెడీ అయ్యారు. మూడు పార్కులను అభివృద్ధి చేశామంటూ రూ.12.12 లక్షలు లేపేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం సంబంధిత వార్డు కౌన్సిలర్లకు కూడా తెలియకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్టణ నాయకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇదంతా కొంతమంది పాలకులు, ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోందనే ప్రచారం సాగుతోంది.

ఇప్పుడు చేసిందేమీ లేదు

మున్సిపల్ పరిధి 15వ వార్డులోని కమలానగర్ పార్కు ఇది. పార్కు స్థలాన్నే క్రీడా ప్రాంగణంగా చూపించారు. కాలనీలో మరోచోట ప్రభుత్వ స్థలం లేకపోవడంతో దీన్నే ఎంపిక చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, క్రీడా ప్రాంగణానికి అవసరమైన ఎలాంటి ఏర్పాట్లు చేయకుండానే ఓ కాంట్రాక్టర్ పేరుపై రూ.4.04 లక్షల బిల్లు లేపేందుకు సిద్ధమయ్యారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో 2019లోనే ఈ పార్కులో ఆట సామగ్రి, వాలీబాల్ కోర్టు, ఎక్సర్‌సైజ్ బార్, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. వీటికి ఒకటి రెండు ఆట వస్తువులు జోడించి క్రీడా ప్రాంగణంగా బోర్డు తగిలించారు. పార్కును అభివృద్ధి చేశామంటూ బిల్లు నొక్కేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.



15వ వార్డు కమలానగర్‌లోని పార్కు

నిండా పిచ్చి మొక్కలే

పిచ్చి మొక్కలతో కనిపిస్తున్న ఈ పార్కు 17వ వార్డులోని మేఘన టౌన్‌షిప్‌లోనిది. ఈ పార్కును సైతం అధికారులు క్రీడా ప్రాంగణం కింద ఎంపిక చేశారు. లే అవుట్ చేసిన యజమాని గతంలోనే ఇక్కడ వాలీబాల్ కోర్టు, బాస్కెట్ బాల్ కోర్టు, స్టేజీని నిర్మించారు. అధికారుల కంటికి ఇదేదో బాగా కనిపించే సరికి.. ఇక్కడ కూడా క్రీడా ప్రాంగణం బోర్డు తగిలించేశారు. ఈ పార్కులో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన పాపాన పోలేదు. కనీసం క్రీడా ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను కూడా తొలగించలేదంటే వీరి నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ పార్కులో పనులు చేసినట్లు చూపుతూ ఓ కాంట్రాక్టర్ పేరు మీద బిల్లులు రెడీ చేశారు.

చేయాల్సిన పనులివే..

నిబంధనల ప్రకారం క్రీడా ప్రాంగణం సిద్ధం చేయడానికి ముందు ఎంపిక చేసిన స్థలాన్ని చదను చేసి, నీళ్లు పోస్తూ రోలర్‌తో తొక్కించాలి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులకు అవసరమైన పోల్స్ పాతి నెట్ కట్టాలి. ఎక్సర్‌సైజ్ బార్ వేయాలి. క్రీడా ప్రాంగణం చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలి. కానీ ఈ పనులేవీ పార్కుల్లో చేయలేదు.

“ త్వరలోనే పూర్తిచేస్తాం

ఇప్పటి వరకు మూడు పార్కుల్లో లెవలింగ్ పనులు పూర్తయ్యాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులు వేశాం. జిమ్ బార్లు కూడా ఏర్పాటు చేశాం. చిన్న చిన్న పనులు మిగిలాయి. వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తాం.

– రాయుడు, ఏఈ, మున్సిపల్ ఇంజనీరింగ్

పాతవాటినే కొత్తగా..

ఈ ఫొటోలోని పార్కు 14వ వార్డు ఎల్‌ఐజీ సినీమ్యాక్స్ థియేటర్ వెనకాలది. దీనికి కూడా క్రీడా ప్రాంగణం బోర్డు వేశారు. గత పాలకవర్గం సమయంలో మున్సిపల్ నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయగా కాలనీవాసులు ఇంటింటికీ రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకుని ప్రహరీ నిర్మించుకున్నారు. అందులో మిగిలిన డబ్బుల నుంచి సిమెంట్ బెంచీలు, వాలీబాల్ పోల్స్ పాతడంతో పాటు, కాలినడకకోసం చుట్టూ డస్ట్ పోయించారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం రెండేళ్ల క్రితం పార్కు అభివృద్ధికి మరోసారి రూ.5 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులు కూడా ఖర్చు చేసినా పార్కు మాత్రం డెవలప్ కాలేదు. పార్కులోని మట్టి కుప్పలు ఎప్పుడికక్కడే ఉండిపోయాయి. ఇది సరిపోదన్నట్లుగా అధికారులు క్రీడాప్రాంగణం పేరుతో రూ.4.4 లక్షలు కాజేసేందుకు సిద్ధమయ్యారు. తమ సొంత డబ్బుతో చేసుకున్న అభివృద్ధి పనులను చూపించి, అధికారులు నిధులు డ్రా చేసుకునే కుట్ర చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



14వ వార్డు ఎల్‌ఐజీ కాలనీ పార్కు

గజగజ



- వణికిస్తున్న చలి
- జిల్లావ్యాప్తంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- మర్పల్లిలో 5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు

తాండూరు: జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. మూడు రోజుల క్రితం వరకు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆదివారం నుంచి ఒక్కసారిగా చలి పంజా విసరడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికి తోడు శీతల గాలులు జనాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. వాతావరణ కాలుష్యం, చలిగాలుల కారణంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. సోమవారం వాతావరణ శాఖ ఉష్ణోగ్రతలను విడుదల చేసింది. జిల్లాలోని 19 మండలాల్లో 5నుంచి నుంచి 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయాయి. అక్టోబర్ నెలాఖరు నుంచి చలికాలం సీజన్ మొదలైంది. అయితే నవంబర్, డిసెంబర్ నెలల్లో దీని తీవ్రత పెద్దగా కనిపించలేదు. కానీ ఒక్కసారిగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో చిన్నారులు, వృద్ధులు సతమతమవుతున్నారు. మరోవైపు ఈనెలలో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఒక్క రోజు వీచిన చలి గాలులకు చిన్నా, పెద్దా తేడా లేకుండా శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు బారిన పడ్డారు. మర్పల్లిలో అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పూడూరులో 6.4 డిగ్రీలు, యాలాల, బొంరాస్‌పేట్, బంట్వారం, వికారాబాద్ మండలాల్లో 7నుంచి 8 డిగ్రీలు, కొడంగల్ మండలంలో 11 డిగ్రీలు, మిగిలిన మండలాల్లో 8నుంచి 10 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. చలి తీవ్రతతో ఉదయం 8గంటలు దాటినా జనం బయటకు రావడం లేదు.

“ జాగ్రత్తలు తీసుకోవాలి



ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల చలికి ప్రజలు అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరిగింది. చలి కారణంగా వచ్చే వారి కోసం ప్రత్యేక చికిత్సలు చేస్తున్నాం. అస్తమా, జలుబు, శ్వాసకోశ బాధితులకు వెంటనే వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజలు చలిబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– దర్మిది రవిశంకర్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

షాద్‌నగర్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తానని పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్, బూర్గుల, వెల్జర్ల, కమ్మదనం, కొందుర్గు, షాద్‌నగర్ పట్టణంలోని ఉర్దూ మీడియం, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఫరూఖ్‌నగర్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఎన్నో సమస్యలను పీఆర్‌టీయూ పరిష్కరించిందని గుర్తు చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సురేష్‌సింగ్, సురేష్, యాదయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, రాధికమ్మ, అరుణ, అరుంధతి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉచ్చు బిగుస్తోంది!

- అధికారుల మెడకు చుట్టుకుంటున్న ప్రొటోకాల్ వ్యవహారం
- డీఈఓ, ఎంపీడీఓ, ఎంఈఓలకు మెమోలు
- ఎంపీడీఓ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక

వికారాబాద్: వెనకాముందు ఆలోచించకుండా ప్రదర్శించిన అత్యుత్సాహం.. అధికార పార్టీలో నెలకొన్న గ్రూపు తగాదాలు అధికారుల మెడకు చుట్టుకున్నాయి. యాలాల మండలంలో గత నెల 29, 30, 31 తేదీల్లో మండల స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పేర్లు వేయలేదు. దీంతో ఎంపీడీఓ ప్రొటోకాల్ పాటించలేదని ఆ వర్గం నాయకులు కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ విషయమై ఎంపీడీఓకు మెమో జారీ చేసిన అధికారులు విచారణ చేపట్టారు. అయితే స్కూల్‌లో నిర్వహించినది అనధికారిక కార్యక్రమం అని, ప్రొటోకాల్‌కు ఏమాత్రం సంబంధం లేదని ఎంపీడీఓ వివరణ ఇచ్చారు. ఇది సమస్యను మరింత జటిలం చేసింది. అప్పటి వరకు కేవలం ఎంపీడీఓ ప్రొటోకాల్ పాటించలేదనే సమస్యకే పరిమితమైన వివాదం.. అనధికారి కార్యక్రమం అని చెప్పడంతో హాజరైన ఇతర అధికారుల మెడకు చుట్టుకుంది.

డీఈఓ, ఎంపీడీఓ, ఎంఈఓ

యలాల మండల కేంద్రంలో మూడు రోజులు పాటు క్రీడోత్సవాలు నిర్వహించగా ఈ కార్యక్రమానికి 10 ఉన్నత పాఠశాలలు, 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత స్కూళ్లకు చెందిన విద్యార్థులు, హెచ్‌ఎంలు, పీఈటీలు, పీడీలతో పాటు డీఈఓ రేణుకాదేవి సైతం హాజరయ్యారు. వివాదం జరిగే అవకాశం ఉందని అనుమానించిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సీఎల్ పెట్టుకుని కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు సమాచారం. ఎంఈఓ సైతం సీఎల్ పెట్టినట్లు తెలుస్తోంది. క్రీడోత్సవాలు అనధికారిక ప్రోగ్రాం అని ఎంపీడీఓ వివరణ ఇవ్వటంతో అధికారులు కొత్త వివాదంలో చిక్కుకున్నట్లయింది. అనధికారిక కార్యక్రమానికి డీఈఓ, ఎంపీడీఓ ఎందుకు హాజరయ్యారు..? మూడు రోజుల పాటు 60 పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఎలా వచ్చారు. వారికి అనుమతి, లేదా ఆర్డర్ ఇచ్చిందెవరు..? అనే ప్రశ్నలు తెరపైకి వచ్చాయి.

విచారణకు మంత్రి ఆదేశం

చినికిచినికి గాలివానలా మారిన వివాదం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వరకు వెళ్లింది. ముందుగా ప్రొటోకాల్ పాటించలేదని ఫిర్యాదు చేసిన మహేందర్‌రెడ్డి.. అది అనధికారిక కార్యక్రమం అని ఎంపీడీఓ వివరణ ఇవ్వటంతో అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు ఎలా హాజరయ్యారు..? ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరపాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మను మంత్రి సబితారెడ్డి ఆదేశించారు. ప్రొటోకాల్ పాటించలేదని అందిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని అడిషనల్ కలెక్టర్‌తె లిపారు. ఇందుకోసం కమిటీని నియమించామని, నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మట్టి పరీక్షలతో మేలైన దిగుబడి

- ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేయించుకోవాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

ధారూరు: రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించి, వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. సోమ వారం ధారూరులో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవాలు, పశువులకు నట్టల నివారణ మందులు వేశారా..? గొర్రెల పంపిణీకి లబ్ధిదారులను గుర్తించారా..? అని వెటర్నరీ డాక్టర్ స్వర్ణలతను ప్రశ్నించారు. వ్యాక్సిన్ రాలేదని, ఫిబ్రవరిలో వేస్తామని వైద్యురాలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. నాగారంలో రైతు వేదిక నిర్మించి రెండున్నరేళ్లు పూర్తయినా ఇంతవరకూ బిల్లులు రాలేదని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. మనబడి కింద చేసిన పనులకు సంబంధించి ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు రావడం లేదన్నారు. ధారూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో అటెండర్ లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే నియమించాలని సర్పంచు చంద్రమౌలి చైర్‌పర్సన్‌ను కోరారు. ధారూరు– చింతకుంట గ్రామాల మధ్య కాగ్నాన దిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పూర్తికాలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.50 లక్షలు వెచ్చించి పనులు చేయిస్తామని చైర్‌పర్సన్ స్పష్టంచేశారు.

నీటి వృథాను అరికట్టండి

గ్రామాలు, తండాల్లో ఎక్కడ చూసిన మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతోందని, దీన్ని వెంటనే అరికట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సర్పంచ్‌లకు సూచించారు. రూ.వేల కోట్ల నిధులు కేటాయించి అంతటా సరఫరా చేస్తుంటే.. ఇలా నిర్లక్ష్యం చేయడం తగదని హితవు పలికారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను నాశనం చేయకుండా కాపాడుకోవాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండే విధానాల వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఉద్యాన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా స్థాయి ప్రధాన అధికారి అవినీతికి పాల్పడితే ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని, ఇలాంటి వాటికి అందరూ దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయలక్ష్మి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయకుమార్, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ విజయకుమార్, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా మేనేజర్ సుధారాణి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ డీఈ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్లు సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డిలు, ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ భువనేశ్వర్, గడ్డమీదిగంగారం సర్పంచు అమర్‌నాథ్, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన చెంగోల్

తాండూరు మండల పరిధిలోని చెంగోల్‌లో పోచమ్మతల్లి జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. నగరానికి చెందిన జోగిని నిషక్రాంతి చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంబరాల్లో జెడ్పీటీసీ మంజుల, సర్పంచు మల్లీశ్వరిగౌడ్, ఎంపీటీసీ రత్నమాల, ఉప సర్పంచు లక్ష్మణ్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి జాతరకు హాజరవుతారని సర్పంచ్ తెలిపారు.

– తాండూరు రూరల్



నృత్యం చేస్తున్న జోగిని నిషక్రాంతి



ఊరడమ్మకు బోనాలు తీస్తున్న మహిళలు

క్లుప్తంగా

సంక్షేమ భవనం మంజూరు చేయండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న మాజీ సైనికులు

కొడంగల్ : నియోజకవర్గంలోని సైనికులకు, మాజీ సైనికులకు సంక్షేమ భవనం మంజూరు చేయాలని మాజీ సైనికులు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వారి సమస్యలు వివరించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు రెండు వేల మందికి పైగా సైనికులు, మాజీ సైనికులు ఉన్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. వారి కుటుంబాల అవసరాల కోసం సంక్షేమ భవనంతో పాటు క్యాంటీన్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సైనికులు, మాజీ సైనికులు క్యాంటిన్ సరుకుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సమీకృత మార్కెట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కొడంగల్ : అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ మొదటిసారి కొడంగల్ పట్టణానికి వచ్చారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అదనపు కలెక్టర్‌ను ఆహ్వానించి పట్టణంలోని పలు అభివృద్ధి పనులను చూపించారు. నర్సరీలను, పార్కులను, సమీకృత మార్కెట్, మున్సిపల్ భవన నిర్మాణం పనులు, నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతగా చేసి త్వరగా పూర్తి చేయాలని సంబంధిత బాధ్యులను ఆదేశించారు. మున్సిపల్ ప్రత్యేకాధికారి విమల, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఐసీఎల్ ఫ్యాక్టరీలో అడిషనల్ ఎస్పీ విచారణ



కంపెనీలో అడిషనల్ ఎస్పీ రషీద్

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ శివారులో ఉన్న ఐసీఎల్ ఫ్యాక్టరీలో సోమవారం అడిషనల్ ఎస్పీ రషీద్ విచారణ చేపట్టారు. గత నెల 30న జరిగిన చోరీ ఘటన నేపథ్యంలో ఆయన తాండూరు పోలీసులతో కలిసి ఫ్యాక్టరీలో ఆరా తీశారు. ఫ్యాక్టరీలో పని చేస్తున్న సెక్యూరిటీ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు మేరకు అడిషనల్ ఎస్పీ దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. మధ్యప్రదేశ్‌కు ప్రత్యేక బృందాలను పంపినట్లు త్వరలో దొంగను పట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్లాంట్ ఇన్‌చార్జి దక్షణ మూర్తి, కంపెనీ ప్రతినిధి మోజెస్, డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబులు ఉన్నారు.

ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు?

ఏళ్లుగా భర్తీకాని పోస్టులు
- కార్యాలయాలన్నింటోనూ సిబ్బంది కొరత
- సేవలు అందక ఇబ్బందుల్లో ప్రజలు



పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయం

పెద్దేముల్: ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సేవలు అందడంలేదు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్, విద్యుత్ కార్యాలయంలో ఏఈతో పాటు మండల విద్యాధికారి పోస్టు ఇన్‌చార్జిలతో కొనసాగుతున్నాయి. తహసీల్దార్ ఫయిమ్ ఖాద్రి తొమ్మిది నెలల క్రితం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి తహసీల్దార్ కొనసాగుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రావన్ కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లడం నేటికీ ఆ పోస్టు బర్తీ కాలేదు. రెండేళ్లుగా మండల ఇన్‌చార్జి విద్యాధికారి కొనసాగుతున్నారు. పెద్దేముల్ విద్యుత్ ఏఈ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో కోటపల్లి ఏఈ సాయినాథ రెడ్డి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సైతం పూర్తి స్థాయిలో సిబ్బంది లేక వెలవెలబోతుంది. మండల ప్రజలకు సరైన వేళలో సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల నుంచి సర్వేయర్ లేక రైతులు నానా ఇబ్బందులు తప్పడంలేదు. రియల్ రంగం పుంజుకోవడం, భూ విక్రయాలు పెరగడంతో సర్వేయర్ లేక పడరాన్ని పాట్లు పడుతున్నారు. సుమారు మూడేళ్ల నుంచి మండలానికి పర్మినెంట్ సర్వేయర్ లేరు. భూ సర్వేల కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేరని రైతులు వాపోతున్నారు. దరఖాస్తులు కుప్పలుకుప్పలుగా పెరిగిపోతున్నాయి. పూర్తి స్థాయిలో సర్వేయర్ లేక పోవడంతో గడువు ముగిసిన వెంటనే దరఖాస్తులను రిజక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్యాలయాలల్లో పూర్తి స్థాయిల్లో పర్మినెంట్ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

"సర్వేయర్ లేక అవస్థలు



సర్వేయర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. భూముల సర్వేల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం కానవడం లేదు. రెండు, మూడు మండలాలకు ఒకే సర్వేయర్ ఉండటంతో ఇబ్బందులు తప్పడంలేదు. వెంటనే సర్వేయర్‌ను నియమించాలి.

– రాములు, రైతు, బండమీదిపల్లి

పర్మినెంట్ తహసీల్దార్‌ను నియమించాలి



ప్రభుత్వం వెంటనే తహసీల్దార్ పోస్టును బర్తీ చేయాలి. ఇన్‌చార్జి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ (ధరణి) పనులు చేయడం తప్ప మిగతా పనులు చేయడం లేదు. పొలాలకు వెళ్లేందుకు పాణాదులు సక్రమంగా లేవు. మరోవైపు అధికారులు సమస్యలు పరిష్కరించడంలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి పర్మినెంట్ తహసీల్దార్‌ను నియమించాలి.

– లొంక నర్సింహులు, మాజీ సర్పంచ్, హన్మాపూర్

'మహాసభలకు తరలిరండి'

అనంతగిరి: ఇబ్రహీంపట్నంలో ఈ నెల 13,14న జరిగే టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర (విద్యా) మహాసభలకు తరలిరావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటరత్నం కోరారు. ఈమేరకు మహాసభల వాల్ పోస్టర్‌ను జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని బీఎస్ఆర్ సార్థా కన్వెన్షన్ సెంటర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, కేరళ మాజీ ఆరోగ్య శాఖ మంత్రి శైలజ, ప్రముఖ విద్యావేత్తలు చుక్కారామయ్య, నాగేశ్వర్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు హాజరవుతున్నారన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

జిప్సం ఫ్యాక్టరీ మూసివేయాల్సిందే

జినుగుర్తి గ్రామస్తుల డిమాండ్



జిప్సం ఫ్యాక్టరీలో లారీని అడ్డుకుంటున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: జినుగుర్తి శివారులోని ఉన్న జిప్సం ఫ్యాక్టరీని మూసి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్, నరేందర్, శ్యామ్ పలువురు ఫ్యాక్టరీకి చేరుకున్నారు. ఫ్యాక్టరీలో యాసిడ్‌కు సంబంధించిన లారీని అడ్డుకున్నారు. అక్కడే పని చేస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ వల్ల వాయు కాలుష్యంతోపాటు నీరు కూడా కలుషితం అవుతోందని మండిపడ్డారు. ఫ్యాక్టరీ ఏర్పాటు చేయ వద్దని గ్రామస్తులందరూ గతంలో తీర్మానం చేశామని చెప్పారు. పక్కనే గిరిజన బాలికల హాస్టల్ ఉందని, అందులో 600 మందికిపైగా విద్యను అభ్యసిస్తున్నానన్నారు. వాయు, నీరు కలుషితం వల్ల వారు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కాలుష్య నియంత్రణ మండలితో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు చెప్పారు.

జాయ్‌ఫుల్ ఎడ్యుకేషన్ అందించాలి

చదువులో నిర్బంధం తగదు: గవర్నర్ తమిళిసై

వికారాబాద్: విద్యార్థులకు నిర్బంధ, నియంత్రణతో కూడిన విద్య కాకుండా జాయ్‌ఫుల్ ఎడ్యుకేషన్ అందించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. వికారాబాద్‌లోని గౌతమి మోడల్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన పాఠశాల 20వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'అందరికీ నమస్కారం.. స్కూల్‌కు రావడం.. ఇలా అందరినీ కలవడం సంతోషంగా ఉంది' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. చిన్నారులు, విద్యార్థులకు విద్యనందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్రపై పలు సూచనలు చేశారు. కరోనా సమయంలో విద్యార్థులందరూ ఇళ్ల వద్దే ఉండటంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు పడే కష్టం తల్లిదండ్రులకు తెలిసిందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని తెలిపారు. వివేకానందుడి వంటి వారు దేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. కరోనా సమయంలో మనం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచామని, ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అనేక సవాళ్లను అధిగమించిందని స్పష్టంచేశారు. అనంతరం వివిధ క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, జీఎంఎస్ చైర్మన్ వెంకట్‌నారాయణ, కార్యదర్శి ప్రమీల, డైరెక్టర్ కుమారస్వామి, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ నుంచి బహుమతులు అందుకున్న చిన్నారులు

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- ఆత్మీయ సమ్మేళనంలో కార్యకర్తలకు దిశానిర్దేశం

కుల్కచర్ల: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతికి అనేకమైన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియపర్చాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, రైతుబంధు మండల అధ్యక్షులు రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో పీఆర్టీయూ మండల శాఖ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి ఆవిష్కరించారు.



అత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షులు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి బస్వరాజు, గౌరవాధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అకౌంట్‌లో ఉన్నా.. చేతికందని డబ్బు

- పోస్టాఫీసు ఖాతాల్లో జమవుతున్న పీఎం కిసాన్ యోజన
- ఆందోళనలో అన్నదాతలు

బొంరాస్‌పేట: రైతులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పంట పెట్టుబడి సాయం పీఎం కిసాన్ యోజన అకౌంట్‌లో ఉన్నా చేతికి అందడం లేదు. పోస్టాఫీసు ఖాతాల్లో రెండు విడతలుగా జమ అవుతున్నా చేతికి అందక పోడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పోస్టాఫీసు ఖాతాల్లో డబ్బులు జమ కావడం, పోస్టాఫీసు నుంచి డ్రాచేసుకునే అవకాశం లేకపోవడంతో అట్లాగే ఉండిపోతున్నాయి. రైతులకు ఇబ్బంది ఎదురవుతోంది. డ్రాచేసి ఇవ్వడానికి వీలుకావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కిసాన్ డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖాతా బుక్కులను చూపిస్తున్న రేగడిమైలారం రైతులు

కేజీబీవీ విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు



ప్రథమ బహుమతి పొందిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రిటైర్డ్ డీఎస్పీ యుగంధర్‌రెడ్డి

ధారూరు: మంల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో సోమవారం విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని తాండూరు రామకృష్ణ సేవాసమితి అధ్వర్యంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. విద్యాలయంలో జరిగిన సమావేశంలో రిటైర్డ్ డీఎస్పీ యుగంధర్‌రెడ్డి, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌లు మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థినులకు సూచించారు. ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలైన పూజ, తేజస్విని, అక్షిత, ఉషారాణి, నందినిలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో శాలివాహన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి వెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

టోర్నీ విజేత స్పోర్ట్స్ అథారిటీ జట్టు

కొందుర్గు: మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా సాగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ఓపెన్ టు ఆల్ విభాగంలో ఎనిమిది జట్లు పాల్గొనగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, విజయవాడ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఫైనల్ మ్యాచ్‌లో విజయవాడ జట్టుపై తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ జట్టు విజయం సాధించి ప్రథమ బహుమతికి ఎంపికైంది. విజయవాడ జట్టు ద్వితీయ బహుమతి, మంచిర్యాల జట్టు తృతీయ బహుమతికి ఎంపికైంది. విజేత జట్టుకు మహదేవ్‌పూర్ రవీందర్ రెడ్డి రూ. 50వేలు నగదు బహుమతి అందజేశారు. అలాగే మహబూబ్‌నగర్ వాలీబాల్ అసోసియేషన్ తరపున శాంతకుమార్ ద్వితీయ స్థానంలో నిలిచిన విజయవాడ జట్టుకు రూ. 25వేలు నగదు బహుమతి అందజేశారు. తృతీయ బహుమతి అందుకున్న మంచిర్యాల జట్టుకు కొందుర్గుకు చెందిన కాడిగళ్ల మహేందర్ రూ. 10 వేల నగదు బహుమతి అందజేశారు. రూరల్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన షాద్‌నగర్ జట్టుకు ఎంపీపీ పోతురాజు జంగయ్య రూ. 15 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు ఓటమిని గెలుపునకు నాందిగా భావించాలని సూచించారు. క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, వివిధ పార్టీల నాయకులు కృష్ణారెడ్డి, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, కావలి యాదయ్య, రామకృష్ణ, శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రోత్సాహం

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బాలికల చదువును ప్రోత్సహిస్తోందని జెడ్పీ చైర్ పర్సన్ సునీతా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినులకు స్కూల్ బ్యాగ్స్, బెడ్‌షీట్స్, కార్పెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులకు ఆడపిల్ల భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా బాలికలకు హాస్టల్స్ మంజూరు చేశారన్నారు. బాలకలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజుల, ఎంపీపీ అనితగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూపారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, ప్రిన్సిపల్ పార్వతమ్మ, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బెడ్‌షీట్స్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

పంటల నమోదులో నిర్లక్ష్యం తగదు

ఈ నెల 15లోపు పూర్తి చేయాలి
- వ్యవసాయ శాఖ ఏడీ వినోద్‌కుమార్

మోమిన్‌పేట: పంటల నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేది లోపు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ వినోద్‌కుమార్ ఏఈఓలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వికారాబాదు డివిజన్ పరిధిలోని ఏఈఓల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నమోదులో నిర్లక్ష్యం తగదన్నారు. ప్రతి ఏఈఓ తప్పని సరిగా రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రైతు బీమాలు సకాలంలో పంపించాలన్నారు. రైతు మృతి చెందిన 24గంటల లోపు రైతు బీమా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పీఎం కిసాన్ ఈకేవైసీ మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మోమిన్‌పేట, నవాబ్‌పేట, మర్పల్లి, వికారాబాదు మండలాల వ్యవసాయాధికారులు జయశంకర్, ప్రసన్నలక్ష్మి, వసంత, రమేశ్, 34క్లస్టరుల ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ వినోద్‌కుమార్

'ఆహార భద్రత'ను పకడ్బందీగా అమలు చేయాలి

అనంతగిరి: ఆహార భద్రత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్. వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వికారాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఆహార చట్టాన్ని తూట్లు పొడుస్తూ పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కోత విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బియ్యంతో పాటు చిరుధాన్యాలు కూడా అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. కార్మికులను బానిసత్వంలోనికి నెట్టడానికి లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని, పేదలు గుడిసెలు వేసుకున్న స్థలాలను పేదలకే పంపిణీ చేయాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్రూమ్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్, మైపాల్, చంద్రయ్య, శ్రీనివాస్, రామకృష్ణ, సుదర్శన్, సుభాష్, సతీష్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రాములు

'బీసీ' క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూరు: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ షుకూర్ సమక్షంలో సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షుకూర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ జనాభా అధికంగా ఉన్నప్పటికీ బీసీలకు సమన్యాయం జరగడం లేదన్నారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో నిరంతర పోరాటం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు బస్వరాజ్, గడ్డం వెంకటేశ్, బసంత్, రాము, మతిన్, సురేందర్, తదితరులున్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

పేద కుటుంబాలకు కేసీఆర్ అండ

- ప్రతి ఇంటికీ ప్రభుత్వ సాయం
- ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి
- కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత

కొడంగల్ : రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఇంటికి మేలు చేస్తున్నారని ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ ప్రభుత్వ సాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఆడపిల్లల పెళ్లికి కేసీఆర్ ఆసరాగా ఉన్నారని అన్నారు. కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. పేదింట పెళ్లి జరిగితే అప్పుల పాలు కారాదనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీను అమలు చేస్తున్నారన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ఆసరా ఫించన్లు, కేసీఆర్ కిట్టు, కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రైతు బంధు, రుణ మాఫీ, రైతు బీమా, ఉచిత విద్యుత్, ఒంటరి మహిళలకు ఫించన్లు తదితర పథకాలతో ప్రజలకు మేలు చేస్తున్నట్లు చెప్పారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తున్నారని అన్నారు. దళితులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో దళిత బంధు పథకం ప్రవేశపెట్టి నిరుద్యోగులైన దళితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలతో ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్ రెడ్డి, రమేష్, డిప్యూటీ తహశీల్దార్ సురేష్, సర్పంచులు వెంకట్‌రెడ్డి, పకీరప్ప, గోవింద్, అంజద్, మాజీ సర్పంచు రమేష్‌బాబు, టీఆర్ఎస్ నాయకులు సిద్దిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే తదితరులు